# ఈనాడు సంగారెడ్డి

శుక్రవారం సెప్టెంబరు 27, 2024




## వంట ఏజెన్సీలకు ఊరట

**మధ్యాహ్న భోజన పథకం బకాయిలు రూ.1.48 కోట్లు విడుదల**



న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట: విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాకు రూ. 1.48 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు రావడంతో వంట ఏజెన్సీలకు ఊరట దక్కింది. ఆగస్టు నెల వరకు అన్ని బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని సూచించింది. ఇక నుంచి ప్రతి నెలా నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ప్రకటించింది.

### ప్రత్యేక పరిశీలన

పాత బిల్లులు రావడం, ఇక నుంచి నెల నెలా బిల్లులు చెల్లిస్తామని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంతో నాణ్యతపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించే ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండేవి. వారు పూర్తి స్థాయిలో పర్యవేక్షించేవారు కాదు. ఇటీవల అన్ని మండలాలకు ఎంఈవోలను కేటాయించడంతో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడమే కాకుండా విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించాల్సి ఉంటుంది. భోజనం నాణ్యతగా లేకుంటే చర్యలు తీసుకుంటారు. బిల్లులు విడుదలైన నేపథ్యంలో వంట ఏజెన్సీలు విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

### నేరుగా ఖాతాల్లో జమ

జిల్లాలోని 1,218 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. వారంలో ఆరు రోజులు విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. నెల నెలా బిల్లులు రాకపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. అప్పులు చేసి వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రూ.90.40 లక్షలు, దీంతో పాటు గుడ్ల పంపిణీకి ప్రత్యేకంగా రూ.58.36 లక్షలు విడుదల చేశారు. విద్యార్థులకు వారంలో 3 రోజులు గుడ్డు అందిస్తారు. మరో మూడు రోజులు రాగా జావా పంపిణీ చేస్తున్నారు. విడుదలైన బకాయిలు నేరుగా వంట ఏజెన్సీ నిర్వాహకుల ఖాతాల్లో జమ చేశారు. పాత బిల్లులు కూడా రావడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రెండు పడక గదుల ఇళ్ల పనులు వేగవంతం చేయండి: కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రెండు పడక గదుల ఇళ్ల పనులతో పాటు.. వివిధ అభివృద్ధి శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ శివారులోని జూకల్, జహీరాబాద్ డివిజన్‌లోని హోతి-కెతో పాటు ఇతర ప్రాంతాల్లోని అసంపూర్తి ఇళ్ల పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకు అవసరమయ్యే నిధుల కోసం అంచనాలు సిద్ధం చేయాలని గృహ నిర్మాణశాఖ మేనేజర్ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న పీఆర్, ఆర్‌అండ్‌బీ రహదారులు, వంతెన పనులను వెంటనే చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో గుర్తించిన పనులు వేగవంతం చేయాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా క్యాంటీన్లను వెంటనే ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ జగదీశ్వర్, డీఆర్‌డీవో జ్యోతి, మెప్మా పీడీ గీత, డీఈవో వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ రాంబాబు, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, వివిధ శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

## నిత్యం రద్దీ.. రోగుల ఇబ్బంది

- ఖాళీ పోస్టులు.. అరకొర వసతులు
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తీరిది..

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

**నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. రోగులతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. ఇక్కడ పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో వారికి నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఆసుపత్రికి వచ్చిన వారికి అరకొర వసతులతో ఇబ్బందులు తప్పడం లేదు. – న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.**

### నిత్యం వేయి మందికి పైగా..

సంగారెడ్డిలోని జిల్లా ఆసుపత్రిలో 300 పడకలు, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరో 150 పడకలున్నాయి. ఈ రెండు ఆసుపత్రులకు కలిపి నిత్యం వేయికి పైగా రోగులు వస్తుంటారు. రోజుకు 250 మందికి పైగా ఇన్‌పేషంట్లు ఉంటారు. ప్రధానంగా టైఫాయిడ్, డెంగీ, రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, దీర్ఘకాలిక రోగులు ఎక్కువ మంది సేవలు పొందుతుంటారు.



### వైద్యులు ఇలా..

మొత్తం పోస్టులు: **359**

విధులు నిర్వహిస్తున్నవారు: **190**

ఖాళీలు: **169**

### ప్రధాన సమస్యలివి..

- అత్యవసర వార్డుకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది.
- పాత భవనం వర్షానికి కురుస్తోంది.
- ఆరోగ్య పరీక్షల ఫలితాల్లో జాప్యంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.
- మందుల పంపిణీకి అదనపు కౌంటర్ లేక ఇబ్బందులు
- రోగులు, వారి బంధువులకు భోజనశాలలు లేవు.
- ఆవరణలోని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు.
- అదనంగా సీటీ స్కానర్ అవసరముంది.
- దంత పరీక్షలు, ఇతర శస్త్ర చికిత్సల కీలక విభాగాలకు సరిపడా యంత్రాలు లేవు.
- ఎంఆర్ఐ స్కానర్ మంజూరు చేయాల్సి ఉంది.

### విజృంభిస్తున్న జ్వరాలు

(జులై 1 నుంచి ఈ నెల 26 వరకు)

| నెల | విషజ్వరాలు | డెంగీ | గన్యా | టైఫాయిడ్ |
|---|---|---|---|---|
| జులై | 199 | 3 | 5 | 17 |
| ఆగస్టు | 800 | 50 | 10 | 29 |
| సెప్టెంబరు | 1136 | 54 | 80 | 34 |

### వైద్య కళాశాల మంజూరైనప్పటికీ..

మూడేళ్ల క్రితం జిల్లాకు వైద్య కళాశాల మంజూరయింది. అదే స్థాయిలో పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు లేవు. 169 మంది వైద్యులను పూర్తి స్థాయిలో నియమించలేదు. ఉన్నవారితోనే రోగులకు వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగులను హైదరాబాద్‌కు తరలించాలంటే కీలకమైన అంబులెన్సులు లేవు. ఉన్నవి సరిపోవడం లేదు. రూ.వేలు వెచ్చించి ప్రైవేటు అంబులెన్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. ఆరోగ్య పరీక్షల ఫలితాల సందేశం నేరుగా రోగుల చరవాణిలకు 24 గంటల్లో చేరాల్సి ఉండగా.. సాంకేతిక లోపం వల్ల జాప్యమవుతోంది. ఖాళీ పోస్టుల భర్తీపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

– జి.అనిల్‌కుమార్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు.

## ధైర్యం, ఆత్మవిశ్వాసానికి ప్రతీక ఐలమ్మ: కలెక్టర్



ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి




జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ధైర్యం, ఆత్మ విశ్వాసానికి ప్రతీక ఐలమ్మ అని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గొప్ప పోరాట యోధురాలు, తెలంగాణ పౌరుషాన్ని చాటిన ధీరవనిత అని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఖర్చు రూ.50 లక్షలు.. ఏవీ వెలుగులు?



**సదాశివపేట పట్టణంలోని వికారాబాద్- మోమిన్‌పేట మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీగా ప్రయాణికులు వెళుతుంటారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ప్రభుత్వం 2019లో రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో డివైడర్ నిర్మించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో హైమాస్ట్ దీపాలు వెలగడం లేదు. నిధులు ఖర్చయినా నిర్దేశిత లక్ష్యం నెరవేరడం లేదని పట్టణవాసులు పేర్కొంటున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట**

## సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్కల్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోని గురువారం 14,563 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రెండు గేట్లు ఎత్తి 19,107 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 29.827 టీఎంసీల నీరుంది. మంజీరా నది పరీవాహక ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని ఏఈ మహిపాల్‌రెడ్డి సూచించారు. సింగూరు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఈ నెల 5వ తేదీ నుంచి నిరంతరాయంగా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. 7.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు పని చేస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 6.8 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు మినీ హైడల్ స్టేషన్స్ చీఫ్ ఇంజినీర్ రమేశ్‌బాబు తెలిపారు.

### ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జహీరాబాద్, న్యూస్‌టుడే: ఝరాసంగం మండలం మాచునూర్ గ్రామంలోని ఓ స్థలానికి సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేసినందుకు ఝరాసంగం మండల పంచాయతీ అధికారి లక్ష్మయ్య, మాచునూర్ కార్యదర్శి సంపత్‌కుమార్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెండు నెలల క్రితం డీఎల్‌పీవో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదించగా గురువారం ఉత్తర్వులు వచ్చాయన్నారు. వీరితో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు.



### 27, 28 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఉమ్మడి మెదక్ జిల్లాలో డీఎస్సీ-2008 పరీక్ష రాసి 70:30 శాతం రిజర్వేషన్ల వల్ల ప్రభావితమైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 292 మంది అభ్యర్థుల జాబితాను అంతర్జాలంలో ఉంచినట్లు పేర్కొన్నారు.



## జెన్కో ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పుల్కల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా నిర్మించ తలపెట్టిన రామగుండం థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని పూర్తిగా జెన్కోకే కేటాయించాలని 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గా అశోక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సింగూరు జలవిద్యుత్తు కేంద్రం వద్ద గురువారం జెన్కో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రామగుండం ప్లాంటును సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించాలనే నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సంస్థల నిర్మాణంలో సింగరేణి భాగస్వామ్యం సరైంది కాదన్నారు. రామగుండం ప్లాంటును పూర్తిగా జెన్కోకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. సంఘం నాయకులు పాండయ్య, చంద్రయ్య, నాగరాజు, శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### 'రైతుల పోరాటానికి అండగా నిలుస్తాం'

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్, న్యూస్‌టుడే: ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ భూములు కోల్పోతున్న రైతుల పోరాటానికి అండగా నిలుస్తామని పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, న్యాయ నిపుణుడు నర్సింహారెడ్డి అన్నారు. న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో గురువారం పర్యటించారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా చేపట్టిన రైతుల పోరాటానికి మద్దతుగా గ్రామంలో సమావేశం నిర్వహించారు. జీవ వైవిధ్యం ఉట్టిపడే పచ్చని పంట పొలాలను బలవంతంగా లాగేసుకొని.. కాలుష్య కాసారాలు ఏర్పాటు చేస్తామంటే పర్యావరణవేత్తలుగా సహించేది లేదని, రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రైతులు అధైర్యపడొద్దని న్యాయ పోరాటం చేసి భూములు కాపాడుకుందామని పురుషోత్తంరెడ్డి బృందం భరోసా ఇచ్చింది. సమావేశంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

## ముఖాముఖికి 91 మంది హాజరు



అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకులకు గురువారం మెదక్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో ముఖాముఖి నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 91 మంది హాజరయ్యారు. డైరెక్టర్ ఆఫ్ ఆయుష్ కమిషన్ ద్వారా నియమించిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక కొనసాగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఆయుష్ ఏడీ డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ.. రోగాల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శిక్షకులు తరగతులను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కమిటీ కన్వీనర్, వరంగల్ ఆర్డీడీ డాక్టర్ ప్రమీలాదేవి, జిల్లా ఆయుష్ వైద్యాధికారి మనోహర్‌రెడ్డి, నేచురోపతి వైద్యుడు దేవయ్య, మెదక్, సర్దన, సిద్దిపేట, సంగారెడ్డి ఆయుష్ వైద్యాధికారులు మధుమిత, విజ్ఞత, ఉమాదేవి, నర్మద షిండే తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం




మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ సూచించారు. గురువారం కొండాపూర్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహహింస, బాల్యవివాహాలు, పోక్సో, వరకట్న నిషేధం తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. వసతి గృహ ఆవరణను శుభ్రం చేయించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. భోజనశాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐటీఐలో చేరికకు మరో అవకాశం

### కొనసాగుతున్న తక్షణ ప్రవేశాలు



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో ప్రవేశాలకు ఇప్పటికే నాలుగు దశల్లో చేపట్టిన ప్రక్రియ ముగిసింది. నాలుగు విడతల తర్వాత ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 28 వరకు అవకాశం కల్పించారు. తక్షణ ప్రవేశాల్లో భాగంగా విద్యార్హత, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు.

**ప్రభుత్వ ఐటీఐల్లో ఇలా..**

| కళాశాల | సీట్లు | భర్తీ |
|---|---|---|
| సంగారెడ్డి | 412 | 386 |
| హత్నూర | 156 | 130 |
| పటాన్‌చెరు | 192 | 178 |

### ఖాళీ సీట్ల భర్తీకి..

జిల్లాలో 18 ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ఇందులో మూడు ప్రభుత్వ ఐటీఐలు కాగా.. ప్రైవేటువి 15. ఈ విద్యా సంవత్సరం ఆయా కళాశాలల్లో సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లకు రెండేళ్ల కిందటి వరకు డిమాండ్ ఎక్కువగా ఉండేది. మొదటి విడతలోనే సీట్లన్నీ భర్తీ అయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. నాలుగు విడతల ప్రవేశాల ప్రక్రియ ముగిసినా ఇప్పటికీ సీట్లు మిగిలిపోవడం గమనార్హం. ఈ విద్యా సంవత్సరం జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐల్లో కలిపి 760 సీట్లు ఉండగా ఇప్పటి వరకు 694 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 66 సీట్లు మిగిలిపోయాయి. ప్రైవేటు ఐటీఐల్లో 1500 వరకు సీట్లు ఉండగా ఇందులో సగం కూడా భర్తీ కాలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కళాశాలలు నడపడం కష్టమేనని ప్రైవేటు ఐటీఐల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

### దరఖాస్తు ఇలా..

ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఐదో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. http:///iti.telangana.gov.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి నచ్చిన కోర్సు, కళాశాలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

### సత్వర ఉద్యోగావకాశాలు ఉంటాయి


ఐటీఐలో ఐదో విడత ప్రవేశాల కోసం నిర్ణీత గడువులోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తక్షణ ప్రవేశాల కోసం నచ్చిన కళాశాలల్లో ధ్రువపత్రాలతో హాజరుకావాలి. అర్హత ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. సీట్ల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది. ఐటీఐ కోర్సు పూర్తిచేసిన వారికి సత్వర ఉద్యోగావకాశాలు ఉంటాయి.

–రాజేశ్వరరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, సంగారెడ్డి.

# దర్శనీయం.. తీర్చిదిద్దితే పర్యాటకం

**విశేషాల వేదికగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలు**





ఆనందం, ఆహ్లాదం సొంతం చేసుకునేందుకు నచ్చిన ప్రదేశాన్ని సందర్శిస్తుంటారు. సంస్కృతి, సంప్రదాయ, ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలు, జల వనరులు, ప్రాజెక్టులు, అటవీ, ఇతర ప్రాంతాలు.. ఎన్నో పర్యాటకంగా ఆదరణ పొందుతున్నాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోనూ ఎన్నో ప్రాంతాలు పేరొందాయి. పెరుగుతున్న జనాభా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సందర్శనీయ ప్రాంతాలను సుందరీకరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజలకు ఆహ్లాదం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం ఖాయం. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

### అభివృద్ధి అవశ్యం

**గజ్వేల్:** 50 టీఎంసీల సామర్థ్యంతో గజ్వేల్-దుబ్బాక నియోజకవర్గాల మధ్య నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గతంలో ప్రతిపాదనలు పంపించగా కార్యరూపం దాల్చలేదు. 23 కి.మీ. పొడవుతో నిర్మించిన భారీ ఎత్తున కట్ట, ఒక పక్క కొండలు, చెట్లతో ఆహ్లాదం పంచే ఈ ప్రాజెక్టును చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారు. సౌకర్యాల కరవుతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మత్స్య సంపద, ప్రాజెక్టు చెంతన పచ్చని పొలాలు, ప్రకృతి రమణీయత ఉట్టిపడే ఇక్కడి అందాలను తనివితీరా చూడవచ్చు. జలాశయం వద్ద వసతుల కల్పనతో ఆదాయం ఖాయం.



### చరిత్ర ఆనవాళ్లు పదిలం

**కొండాపూర్:** శాతవాహనుల కాలంలో వెలిగిన కొండాపూర్‌లో నేలమాళిగల అవశేషాలెన్నో లభ్యమయ్యాయి. అప్పటి నాణేలు, ఆభరణాలు కూడా బయల్పడ్డాయి. గొప్ప బౌద్ధ క్షేత్రంగా విలసిల్లినట్లు ఆధారాలెన్నో ఉన్నాయి. ఆదిమానవుల ఆనవాళ్లూ తవ్వకాల్లో బయల్పడ్డాయి. రాతి యుగం నాటి పనిముట్లు లభించాయి. వాటితో మ్యూజియం ఏర్పాటుచేశారు. సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. భోజనశాల ఏర్పాటు చేస్తే బాగు.



### మొసళ్ల అభయారణ్యం

**సంగారెడ్డి టౌన్:** సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులో మంజీర జలాశయాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా గుర్తించారు. ఇక్కడ 580 మొసళ్లు ఉన్నట్లు అధికారుల లెక్క. మొసళ్ల సంతాన వృద్ధి కేంద్రం కూడా ఇక్కడ ఉంది. రాంసర్ సైట్‌గా గుర్తింపునకు ప్రతిపాదనలు పంపారు. ఆమోదిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. సందర్శకులకు అన్ని వసతులు కల్పించాలి. చిన్నారులు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలి. పార్కును విస్తరించాలి.

### 'సాగర్'ను తీర్చిదిద్దితే..

**సిద్దిపేట:** సిద్దిపేటకు సమీపంలో 3 టీఎంసీల సామర్థ్యంతో రంగనాయక సాగర్‌ను నిర్మించారు. దీని మధ్య ద్వీపం (45 ఎకరాలు) ప్రత్యేక ఆకర్షణ. జలాశయం చుట్టూ 8.65 కి.మీ. కట్ట తీర్చిదిద్దారు. నిత్యం 200 మంది వరకు సందర్శిస్తున్నారు. పర్యాటకులకు వసతులు కరవయ్యాయి. ప్రత్యేక నిర్మాణాలు లేవు. ప్రి వెడ్డింగ్, లఘుచిత్రాలు, ఇతర వాటికి వేదికైంది. సైక్లింగ్ పోటీలకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటక ధామంగా అభివృద్ధికి గతేడాది రూ.125 కోట్లు వెచ్చించి పనులు ప్రారంభించగా, అవి నిలిచిపోయాయి. వీటిని పూర్తిచేస్తే ఉమ్మడి జిల్లా, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది.



### జిల్లాల సరిహద్దులో..




పోచారం వన్యప్రాణి అభయారణ్యం

**మెదక్, హవేలిఘనపూర్:** మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న పోచారం అభయారణ్యం, పోచారం ప్రాజెక్టు వద్ద సరైన వసతులు కరవయ్యాయి. వారాంతం, సెలవు రోజుల్లో 500 మందికిపైగా వస్తున్నారు. ప్రాజెక్టుకు వెళ్లేందుకు మట్టి దారే ఉంది. దాన్ని బాగు చేయాలి. తాగునీటి వసతి కల్పించాలి. బోటింగ్ సౌకర్యం సైతం లేదు. శిథిలావస్థలో ఉన్న పురాతన కట్టడాలను బాగు చేయించాలి. కొన్నాళ్ల కిందట ప్రతిపాదించినా ఆమోదముద్ర పడలేదు.

### రూపు మారిస్తేనే..

**మెదక్, పాపన్నపేట:** మెదక్ జిల్లాలో ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గమ్మ పుణ్యక్షేత్రానికి ఏటా రూ.7 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం 45 వరకు సత్రాలు ఉన్నాయి. దాత సాయంతో ఒక తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. నిత్యం వెయ్యి మందికిపై దర్శించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించాలి. సేదతీరేలా పెద్దహాల్ మాదిరిగా నిర్మించాలి. పార్కింగ్ స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.



### సేదతీరేలా..

**ధారూర్:** వికారాబాద్ జిల్లా కేంద్రానికి కోట్‌పల్లి ప్రాజెక్టు 20 కి.మీ. దూరంలో ఉంటుంది. అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకొని ఇక్కడికి వస్తుంటారు. వారాంతాల్లో 500 మందికిపైగా సందర్శిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు, కూర్చునేందుకు, సేదతీరడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. పార్కు, పిల్లలు ఆడుకునేలా వస్తువులు అందుబాటులోకి తీసుకొస్తే బాగు. ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం మాత్రమే ఉంది. ఈత కొలను ఏర్పాటుకు డిమాండ్ ఉంది.



## బాల మణిపూసలు

సాహిత్యంలో కవిత్వానిది కీలక పాత్ర. సామాజిక అంశాలను సరళ పదాలతో వ్యక్తపరిచి ఆలోచింపజేయడం కవిత్వం ప్రత్యేకత. తెలుగు భాషపై కొంత పట్టు ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించారు తెలుగు ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం. విద్యార్థి దశలోనే తెలుగు కమ్మదనాన్ని తెలియపరిచి వారిలో ఆసక్తిని పెంచేందుకు కృషి చేశారు. భాషపై మమకారాన్ని పెంచి.. వారితో అక్షర సుమాలను పేర్చించారు. ఉపాధ్యాయుడి సంకల్పాన్ని అందుకున్న చిన్నారులు నిరంతర సాధన చేసి అక్షరాలకు హారతి పట్టారు. వారే జహీరాబాద్ మండలం గొట్టిగారపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు. 51 మంది చిన్నారులు రాసిన 450 కవితలు 'గొట్టిగారపల్లి మణిపూసలు' పేరిట గ్రామపెద్దలు, ఉపాధ్యాయుల సహకారంతో పుస్తక రూపం దాల్చాయి. ఆరు నుంచి పదోతరగతి చిన్నారులు ఇందులో భాగస్వామ్యం అయ్యారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. వడిచర్ల సత్యం ఇప్పటి వరకు 12 పుస్తకాలకు పైగా రాశారు. ఈసారి విద్యార్థులతో రాయించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. - న్యూస్‌టుడే, పాత తాండూరు, జహీరాబాద్



రాసిన పుస్తకాలతో విద్యార్థులు

**చిన్నారులతో రాయించడం సంతృప్తినిచ్చింది: వడిచర్ల సత్యం**

నేను రాయడం కంటే నావద్ద చదువుకున్న విద్యార్థులంతా కవితలు రాసి, వినిపించడం సంతృప్తినిచ్చింది. వాటిని ఒక చోట చేర్చి, పుస్తకంగా రూపొందించాం. తెలుగు భాష ఉన్నతికి, బాలల్లో భాషా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేయాలన్నదే నా ధ్యేయం.

## 16 ఏళ్లకు పండగ

● ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మందికి దక్కనున్న ఉద్యోగాలు



ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎట్టకేలకు ఊరట లభించింది. డీఈడీ అభ్యర్థుల కన్నా మెరిట్ ఉన్న బీఈడీ అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24న సదరు నిర్ణయం తీసుకోగా.. సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంతో అప్పటి అభ్యర్థులకు ఒప్పంద కొలువులు దక్కనున్నాయి. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో 292 మంది ప్రయోజనం పొందనున్నారు.

**30 శాతం మేర..**

డీఎస్సీ 2008 నియామకాల చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో బీఈడీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. డీఈడీ అభ్యర్థుల కన్నా ఎక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదు. తమకు అన్యాయం జరిగిందంటూ నష్టపోయిన వారంతా అప్పట్లో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 292 మందికి ఉద్యోగాలు దక్కనుండటం విశేషం.

**27 నుంచి పరిశీలన..**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తీసుకున్న నిర్ణయంతో 16 ఏళ్ల తర్వాత ఒప్పంద ఉపాధ్యాయ కొలువులు దక్కనున్నాయి. వీరికి నెలకు రూ.31,030 చొప్పున వేతనం చెల్లించనున్నారు. కొలువులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉమ్మడి జిల్లాల వారీగా డీఈవో కార్యాలయాల్లో విడుదల చేశారు. వాటిలో పేర్కొన్న అభ్యర్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు సిద్ధం కావాల్సి ఉంది. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచిన వెరిఫికేషన్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. జాబితాల్లో పేర్కొన్న వారిలో కొందరు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొందరు ఇతర రంగాలు, వృత్తుల్లో స్థిరపడ్డారు. వారి ఆసక్తి మేరకు ఒప్పంద ఉపాధ్యాయులుగా చేరుతారో లేదో తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా వీరిని ఏ పాఠశాలలకు కేటాయిస్తారు, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టుల్లో నియమిస్తారా, లేదా ప్రత్యేక పోస్టులేమైనా సృష్టిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

## వేడుకలకు చర్చి ముస్తాబు

చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్‌ఐ) కూటమి, శ్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (శుక్రవారం) నిర్వహించే ఈ వేడుకలకు మెదక్ డయాసిస్ పరిధిలోని ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. డిప్యూటీ మోడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె.రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీధుల్లో ర్యాలీ, చర్చి ప్రాంగణంలో సీఎస్‌ఐ, శ్రీ మైత్రి సంఘం పతాకాల ఆవిష్కరణ, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.



చర్చి ప్రాంగణంలో వేదిక ఏర్పాట్లు

**ఆసుపత్రికి పూర్వవైభవం:** సుమారు 20 ఏళ్ల కిందట వైద్య సేవలు అందించి మూతపడిన మెదక్ సీఎస్‌ఐ మిషన్ ఆసుపత్రికి పూర్వవైభవం రానుంది. బిషప్ బంగ్లా వెనుకాల కొనసాగిన ఈ ఆసుపత్రి నేడు చర్చి ప్రధాన ద్వారం వద్ద నిర్మించిన భవనంలో ప్రారంభించనున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేశామని ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, చర్చి కమిటీ కోశాధికారి గంట సంపత్ తెలిపారు. - న్యూస్‌టుడే, మెదక్ అర్బన్


## డ్రోన్‌తో గాలించినా దొరకని షాకీర్ ఆచూకీ



గాలింపు చర్యలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

**జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:** జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద నారింజ వాగులో గల్లంతైన షాకీర్ కోసం పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, తహసీల్దార్ రవీందర్ పర్యవేక్షణలో గురువారం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని వాగు పరీవాహకం పొడవునా డ్రోన్ సాయంతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. నారింజ ప్రాజెక్టుతో పాటు కర్ణాటకలోని బరూర్, హుశ్రానా, కంటానా శివార్లలో కురిసిన కుండపోత వర్షాలకు వాగులో వరద తగ్గుముఖం పట్టడం లేదు. గ్రామస్థుల సాయంతో గజ ఈతగాళ్లతో పాటు యువకుల సాయంతో వెతికినా ఫలితం లేకపోయింది. గాలింపు చర్యల్లో సమస్యలపై అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాగు ఉద్ధృతంగా పారడంతో జహీరాబాద్-ఘనపూర్ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. రాకపోకలు నిలిపివేశారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



నిజాముద్దీన్

**పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే:** మూడు రోజులుగా కనిపించని ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై కనిపించాడు. ఈ సంఘటన పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు. మహ్మద్ నిజాముద్దీన్ (47) అవివాహితుడు. వ్యవసాయపనులు చేస్తూ... గ్రామంలో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజులుగా కన్పించలేదు. గురువారం స్థానికులు రాఘవాపూర్ చెరువు పరిసరాల్లోకి వెళ్లగా చెరువు ఒడ్డున అతడు వేసుకునే దుస్తులు, టవల్, చెప్పులు, ఇంటి తాళం చెవులు కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. చెరువులో దూరంగా శవంలా కనిపించడంతో అనుమానంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం పరిగి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



రాజు

**దోమ, న్యూస్‌టుడే:** విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన దోమ మండలం దిర్సంపల్లిలో చోటుచేసుకుంది. దిర్సంపల్లికి చెందిన బొల్లం రాజు(28) కుటుంబం పొలం దగ్గరే ఇల్లు నిర్మించుకొని నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నారు. వ్యవసాయానికి సరఫరా చేసే నియంత్రిక (బుడ్డీ) నుంచి ఇంట్లోకి కరెంటు లాగారు. బుధవారం రాత్రి ఇంట్లోకి సరఫరా లేక చీకటి పడింది. దీంతో నియంత్రికలోని లివర్‌ను ఇనుపపైపుతో సరిచేసే ప్రయత్నం చేయబోయాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. తండ్రి అంజిలయ్య, భార్య స్వప్న గుర్తించి సీపీఆర్ విధానంలో కాపాడే ప్రయత్నం చేశారు. అదే రోజు రాత్రి కారులో వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

| చికెన్ ధరలు | | | |
|---|---|---|---|
| ఫాంరేటు | 125-00 | డ్రెస్డ్ | 213-00 |
| రిటైల్ | 147-00 | స్కిన్‌లెస్ | 243-00 |

## చిన్నారిని లాలించి.. ఆప్యాయత చాటి..



చిన్నారిని లాలిస్తున్న మంత్రి కొండా సురేఖ

**మెదక్, న్యూస్‌టుడే:** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఓ చిన్నారిని లాలించి తన ఆప్యాయతను చాటారు. జిల్లా కేంద్రం మెదక్‌లో ఆరు గ్యారంటీల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్తుండగా ఆరుబయట ఓ సీనియర్ మహిళా కానిస్టేబుల్ చేతిలో పసిబిడ్డను చూసి వెంటనే కాన్వాయ్ ఆపారు. ఆమె వద్దకు వెళ్లి ఎండగా ఉండటంతో చిన్నారికి నీటిని తాగించి వివరాలు ఆరా తీశారు. బాబు తల్లి సైతం తనతో పాటు విధులు నిర్వర్తిస్తున్నారని కానిస్టేబుల్ చెప్పింది. దీంతో బాబు తల్లి.. కానిస్టేబుల్ శ్రీలతను పిలిపించి మాట్లాడారు. వారిద్దరినీ తనతో పాటు కాన్వాయ్‌లో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ మహిళా కానిస్టేబుల్ పరిస్థితిని వివరించి మరోచోట డ్యూటీ వేయాలని ఆదేశించారు.

● చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో హైదరాబాద్ కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టామని తెలిపారు. కలెక్టరేట్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణ

**సిద్దిపేట, న్యూస్‌టుడే:** జిల్లా ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ కోర్) విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎల్ఈడీ దీపాల తయారీపై గురువారం కార్యశాల నిర్వహించారు. 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు తయారీ విధానంపై నేర్పించారు. ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త భాస్కర్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించగా.. హైదరాబాద్ నుంచి ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ హాజరై శిక్షణ అందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.



తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

## రాత్రి చదువు.. ఇంటికి వెలుగు

ఆసక్తి ఉండాలే కానీ ఏ సమయంలోనైనా చదువుకోవచ్చు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. రాత్రి వేళ చదువు మరింత విస్తరిస్తోంది. మండలంలోని ర్యాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సూచనలతో సమయం వృథా చేయకుండా ఈ దిశగా అడుగేయడం గమనార్హం. ఇక్కడి తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ దీనికి బీజం పోశారు. ర్యాకల్, పోతన్‌పల్లి గ్రామాల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు 157 మంది నిత్యం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఇలా చదివి సత్ఫలితాలు సాధించారు.



పంచగామలో రాత్రి చదువుకుంటున్న విద్యార్థినులు

**స్ఫూర్తి అందిపుచ్చుకొని..**

చంద్రశేఖర్ ఇటీవలి ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఖేడ్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఇక్కడ సైతం రాత్రి చదువు అమలుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఖేడ్ పురపాలికతో పాటు సమీప 45 గ్రామాలకు చెందిన 900 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల చొరవతో మూడు నెలలుగా 8 గ్రామాల్లో రాత్రి చదువు కొనసాగుతోంది. మరోవైపు ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఖేడ్ మండలం రుద్రారం, కంగ్టి మండలం తర్కవడగామ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు సైతం దీన్ని పాటిస్తుండటం విశేషం. మరిన్ని చోట్ల రాత్రి చదువుకు ఉపాధ్యాయులు.. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

**దాతల సహకారం**

విద్యార్థులు రాత్రి సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టడంతో పలువురు దాతలు తమ సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారు. గతేడాది ర్యాకల్ ఉన్నత పాఠశాలలో 157 మందికి శాంతా డెవలపర్స్ యజమాని దుప్పట్లు అందజేశారు. పిల్లలకు ఉపయోగపడేలా నిత్యం పాఠశాల ప్రారంభానికి ముందు గంటపాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతి నిర్వహించారు. బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పది విద్యార్థులకు రోజూ సాయంత్రం అల్పాహారం అందించారు. ఖేడ్ మండలం పీర్లతండాకు చెందిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్ పాఠశాలలో గ్రంథాలయంతో పాటు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయించారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్

## పదేళ్లుగా పరాయివాళ్లం: కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న ప్రతినిధులు

**సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే:** పదేళ్ల భారాస పాలనలో మనమంతా సొంత రాష్ట్రంలోనే పరాయివాళ్లుగా మిగిలిపోయామని ఎమ్మెల్సీ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ ఒక్కరి చేతిలోనే పాలన సాగడం దురదృష్టకరమన్నారు. సిద్దిపేటలోని ఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారుల సమస్యలకు పరిష్కారం దొరకలేదని, వాటిపై చర్చకు వేదిక అవసరమని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణలో నానాటికీ నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని ఉద్ఘాటించారు. అనంతరం తమ ఉద్యోగాలను కొనసాగించాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగభద్రత కోసం జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులు, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకులు వినతిపత్రాలు అందజేశారు. వేదిక ప్రతినిధులు పరమేశ్వర్, పెద్దిరాజు, అందె ప్రవీణ్, విక్రమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కనకచంద్రం, కొండి మల్లారెడ్డి, అయిత అంజయ్య, బాపురావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఐకాస మాజీ ఛైర్మన్ డా.పాపయ్యను పరామర్శించారు.

## అవయవదానంతో మరొకరికి పునర్జన్మ

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ ప్రసాదించవచ్చని ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.నరేందర్‌కుమార్ అన్నారు. అవయవదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జీవన్మృతుడు నుంచి సేకరించిన అవయవాల ద్వారా ఇద్దరికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గురువారం ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డా.రాకేశ్ సహాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. ఉస్మానియా వైద్యుల అభ్యర్థన మేరకు అవయవదానంపై రోగుల సహాయకులకు అవగాహన కల్పించేందుకు ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ ఏర్పాటు విషయమై ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డా.సీహెచ్.మధుసూదన్, డా.మనీషా సహాయ్ (నెఫ్రాలజీ), డా.ఎన్.నాగప్రసాద్ (ప్లాస్టిక్ సర్జరీ), డా.మల్లికార్జున్ (యూరాలజీ), డా.చంద్రశేఖర్(అనస్థీషియా) తదితరులు మాట్లాడారు. ఇద్దరికి కాలేయ మార్పిడి, నలుగురికి మూత్రపిండాల మార్పిడి, నలుగురికి కార్నియా మార్పిడి, కాలిన గాయాలకు గురైన వారికి అతికించేందుకు చర్మం అతికించేందుకు అవయవాలు సేకరించినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నరేందర్(46)కు ఈ నెల 18న కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు.



డా.రవి సుందర్‌ను సన్మానిస్తున్న ఉస్మానియా వైద్యులు

## వీరనారి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, అధికారులు

**ములుగు, న్యూస్‌టుడే:** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ములుగు, మర్కూక్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి వీసీ నీరజ ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిడ్యాల కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం మండలాధ్యక్షుడు రాజు, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ భూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జహీరాబాద్ ప్రగతికి ప్రతిపాదనలు



మట్లాడుతున్న ఉజ్వల్‌రెడ్డి, పక్కన కాంగ్రెస్ నేతలు

**జహీరాబాద్, న్యూస్‌టుడే:** నియోజకవర్గ అభివృద్ధి కోసం వివిధ శాఖల ద్వారా రూ.135 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఎస్.ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్‌లో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో సెట్విన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, తాను కలిసి ర.భ.శాఖ రహదారులు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నారింజ ప్రాజెక్టు, చెక్‌డ్యాంల నిర్మాణం, పంచాయతీరాజ్ రహదారులు, పట్టణ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. జహీరాబాద్ శివారులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి, సమీకృత మార్కెట్ భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మంకాల్‌సుభాష్, నర్సింహారెడ్డి, హర్షద్‌పటేల్, శేఖర్, అక్బర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

# పంట తడిసిందని పంపించేస్తున్నారు

న్యూస్‌టుడే, నారాయణఖేడ్ టౌన్

**వెలవెలబోతున్న పెసర కొనుగోలు కేంద్రాలు**



మనూరులోని పెసర కొనుగోలు కేంద్రం

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. చేతికి అందే దశలో వర్షాలు కురవడంతో పంట ఉత్పత్తులు తడిసి ముద్దయ్యాయి. దాంతో జిల్లాలో ఏర్పాటు చేసిన పెసర కొనుగోలు కేంద్రాలకు రైతులు పంట తీసుకొస్తే తడిసిపోయాయని అధికారులు వెనక్కి పంపిస్తున్నారు. చేసేది లేక వారు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. ధాన్యం తడిసినా కొనుగోలు చేస్తారు.. పెసర మాత్రం ఎందుకు చేయరని రైతులు మండిపడుతున్నారు. కేంద్రాలు ప్రారంభించి 15 రోజులైనా వెలవెలబోతున్నాయి.

జిల్లాలో ఈ వానాకాలంలో పెసర 11,220 ఎకరాల్లో వేశారు. నూర్పిడి దాదాపు పూర్తయింది. దిగుబడి 7,900 టన్నుల వరకు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. క్వింటాలుకు రూ.8,682లకు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దిగుబడి అంచనాతో మార్క్‌ఫెడ్ వారు జిల్లాలో జహీరాబాద్, మనూరులలో ఈ నెల మొదటి వారంలో పెసర కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. పంట చేతికి అందే సమయంలోనే భారీ వర్షాలు పడటంతో తడిసిపోయి రంగు మారింది. దాంతో అధికారులు ప్రారంభించిన కేంద్రాల్లో 15 రోజులైనా కిలో పంట కొనుగోలు చేయలేదు. వచ్చిన శాంపిళ్లు తీసుకొని పెట్టుకుంటున్నారు.

**దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు:** తడిసిన పంట కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.8,682 ధర ఏ ఒక్క రైతుకీ దక్కలేదంటే అతిశయోక్తి కాదు. దళారులు క్వింటాకు కేవలం రూ.6000 నుంచి రూ. 7000 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇందులోనే మార్కెట్ కమీషన్, రవాణా ఛార్జీ, కూలీ, తదితర ఖర్చుల తీసేసి చివరకు రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

**నాణ్యమైన ఉత్పత్తులు రావడం లేదు..**

జిల్లాలో రెండు చోట్ల పెసర పంటను కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. నాణ్యమైన ఉత్పత్తులు ఇప్పటి వరకు రాలేదు. వర్షానికి పంట దెబ్బతింది. ఇంకా రెండు సెంటర్లలో కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉన్నాయి. నాణ్యమైనది తీసుకొస్తే కొనుగోలు చేస్తాం.
– శ్రీదేవి, మేనేజర్, మార్క్‌ఫెడ్.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, గుమ్మడిదల, జోగిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ

? అందోలు మండలంలోని రాంసానిపల్లి శివారులో జాతీయ రహదారి పక్కనే చెత్త డంపు చేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. రహదారి వెంట వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు.
–లింగమయ్య, రాంసానిపల్లి.

✓ రహదారుల పక్క చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.
–కుర్మయ్య, గ్రామ కార్యదర్శి రాంసానిపల్లి.

? అందోలు మండలంలోని అన్నాసాగర్ గ్రామ ప్రధాన కూడలి వద్ద గ్రామాలు తెలిపే సూచిక బోర్డు ముళ్లపొదల మాటున చేరింది. దీంతో ఆ రహదారిపై నుంచి వెళ్లే ప్రయాణికులకు ఏ పట్టణం ఏ వైపుందో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. -రాజు, అన్నాసాగర్.

✓ పొదలను తొలగిస్తాం. బోర్డు బయటకు తీస్తాం.
–రవీందర్, డిప్యూటీ ఈఈ ర,భ శాఖ, అందోలు.

? దోమడుగు పంచాయతీ వెనకాల కాలనీలో రాత్రిపూట కుక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. –కదిరప్ప, దోమడుగు

✓ పరిశీలించి జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.
–రాములు, పంచాయతీ కార్యదర్శి, దోమడుగు.

? సంగారెడ్డిలోని వసంత్‌నగర్ కాలనీలో వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. రాత్రి సమయంలో చీకటి ఉంటోంది.
– శివ కుమార్, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.

? పోతిరెడ్డిపల్లిలోని శిల్ప వెంచర్‌లోకి చెత్త సేకరణ సిబ్బంది సరిగా రావడం లేదు. చెత్త ఎక్కడ వేయాలి. – వెంకటేశం, సంగారెడ్డి

✓ రెగ్యులర్‌గా వెళ్లాలని చెత్త సేకరణ సిబ్బందికి సూచనలు చేస్తాం.
– సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు.

# నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం: సంజీవరెడ్డి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, న్యూస్‌టుడే:** రోజంతా నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధి హన్మంతరావుపేట విద్యుత్తు ఉపకేంద్రంలో నిరంతర విద్యుత్తు సరఫరా కోసం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఉపకేంద్రంలోని లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షం, ఈదురుగాలుల వల్ల ఎప్పుడైనా మరమ్మతులు చేసేటప్పుడు కొన్ని ఆటంకాలు జరుగుతాయే తప్ప మిగతా సమయాల్లో ఇబ్బందులుండవన్నారు. ఆయన వెంట పురపాలిక ఉపఛైర్మన్ దారం శంకర్, తాహెర్‌అలీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ఖేడ్‌లో భవిష్యత్తులో రెగ్యులర్ ఎంవీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించి రవాణాశాఖ సేవలు అందిస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. వారానికి రెండు రోజులు ఖేడ్‌లో సేవల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. రైతుబజార్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా ట్రాక్ కోసం పురపాలిక ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మించారని, శౌచాలయాలు, కంప్యూటర్, ఇంటర్‌నెట్ సదుపాయాల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సిబ్బందిని నియమించి త్వరలోనే వారానికి రెండు రోజుల పాటు సేవలు ప్రారంభిస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రెగ్యులర్ ఎంవీఐ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఆయన వెంట పురపాలిక ఛైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, తదితరులు ఉన్నారు.

● మక్తలక్ష్మాపూర్‌కు చెందిన సుశీలకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.70 వేలకు సంబంధించి ఎల్వోసీని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన గృహంలో బాధితురాలి అందజేశారు.

## రాజకీయ కక్షతోనే పీఏసీఎస్ ఛైర్మన్‌పై దాడి: క్రాంతికిరణ్

**జోగిపేట టౌన్, న్యూస్‌టుడే:** టేక్మాల్ పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. గురువారం పట్టణంలో నివాసముంటున్న టేక్మాల్ పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డిని భారాస నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు పెరిగాయన్నారు. ఇందుకు బాధ్యులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో టేక్మాల్ భారాస అధ్యక్షుడు వీరప్ప, నాయకులు పైతర సాయికుమార్, చాపల వెంకటేశం, రవి, నాయికోటి భాస్కర్ తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

**జోగిపేట, న్యూస్‌టుడే:** జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్యుడు జాన్‌పాల్ విద్యార్థులను పరీక్షించారు. ఉచితంగా బ్రష్‌లు అందజేశారు. ప్రతి రోజూ రెండు ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాలన్నారు. క్లబ్ జిల్లా కార్యదర్శులు అనంత్‌రెడ్డి, రాంబాబు, రామకృష్ణ, శ్రీకాంత్, సంతోష్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**సదాశివపేట:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నప్రసాద్ ప్రారంభించారు. ఎంఎన్ఆర్ వైద్య కళాశాలకు చెందిన వైద్యులు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు.

## వరద నీటిని తరలించిన అధికారులు



**జహీరాబాద్, న్యూస్‌టుడే:** రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జహీరాబాద్ శివారులోని బాబుమోహన్, ఫ్రూట్స్ కాలనీల్లో నిలిచిన వరద నీరు, మురుగు నీటిని పురపాలక అధికారులు తొలగించే పనులను గురువారం చేపట్టారు. మాజీ కౌన్సిలర్ నామారవికిరణ్ ప్రత్యేక చొరవతో పురపాలక అధికారులు అక్కడికి చేరుకుని ప్రత్యేకంగా పైపులు వేసి నీటిని తరలించడంతో ప్రజలు ఇబ్బందులు దూరమయ్యాయి. కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, పారిశుద్ధ్య అధికారి సంధ్యాకుమారి పాల్గొన్నారు.

## బైండోవర్ షరతుల ఉల్లంఘన.. జరిమానా..

**పుల్కల్, న్యూస్‌టుడే:** బైండోవర్ షరతులను ఉల్లంఘించిన వ్యక్తిని పుల్కల్ తహసీల్దారు ఎదుట బైండ్ డౌన్ చేసినట్లు ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు. ఇసోజిపేటకు చెందిన నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి అన్నదమ్ములు. వీరి మధ్య కొన్నేళ్లుగా భూ తగాదాలు ఉన్నాయి. ఈ విషయంలో ఇరు వర్గాల నుంచి 6 కేసులు నమోదు అయ్యాయి. గత నెలలో వీరందరినీ తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. అప్పుడు వారు రూ.లక్ష పూచీకత్తు ఇచ్చారు. సుఖేందర్‌రెడ్డి షరతులను ఉల్లంఘించడంతో అతడిని గురువారం తహసీల్దారు ఎదుట బైండ్ డౌన్ చేశారు. దీంతో రూ.లక్ష జరిమానా చెల్లించినట్లు ఎస్సై తెలిపారు. చట్టాన్ని అతిక్రమించి ఇబ్బందులు పడవద్దని పేర్కొన్నారు.

## ఎన్నాళ్లీ నిర్లక్ష్యపు తుప్పు




గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించిన తాగునీటి సరఫరాకు అవసరమైన పైపులు, మోటార్లు, ఇతర సామగ్రిని తరలించడానికి, మోటార్లు కాలిపోతే తీసుకొచ్చి మరమ్మతులు చేసి తీసుకువెళ్లడానికి రెండు వ్యాన్లను సమకూర్చారు. మిషన్ భగీరథ పథకంతో గ్రామాల్లోని రక్షిత మంచి నీటి పథకాల అవసరం లేకుండా పోయింది. దీంతో వ్యాన్ల అవసరం లేకపోవడంతో ఖేడ్‌లోని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉపకార్యనిర్వాహక ఇంజినీరు(ప్రస్తుతం మిషన్ భగీరథ డీఈఈ) కార్యాలయ ఆవరణలో ఏడేళ్లుగా వాహనాలు నిరుపయోగంగా ఉంచారు. దీంతో ఇవి ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ తుప్పు పడుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న వాటిని వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. – న్యూస్‌టుడే, నారాయణఖేడ్.

## కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన

**పుల్కల్, న్యూస్‌టుడే:** పుల్కల్ ఎంపీపీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నల్గొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీవ్ర పని ఒత్తిడిలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులను చిన్న కారణాలతో సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఎంపీవో శ్రీకాంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు

**సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే:** వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా కార్గో లాజిస్టిక్స్ నిర్వహిస్తున్నామని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ ప్రాంతీయ కార్యాలయంలో ఉత్తమ సేవలందిస్తున్న లాజిస్టిక్స్ ఏజెంట్లు, అత్యధిక ఆర్డర్లు ఇస్తున్న వినియోగదారులను ఆమె సన్మానించారు. ఆర్టీసీ ద్వారా అందిస్తున్న లాజిస్టిక్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఐడీఏ బొల్లారం ఎస్సైగా రాములు

**జిన్నారం, న్యూస్‌టుడే:** ఐడీఏ బొల్లారం ఎస్సై-2గా రాములు నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు.

## 28న జాతీయ లోక్ అదాలత్

**జిన్నారం, న్యూస్‌టుడే:** ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్సై నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, ప్రమాద కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. న్యాయ శాఖ కల్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి

**సంగారెడ్డి గ్రామీణ:** కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయని పరిశ్రమల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. సంగారెడ్డి క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పరిశ్రమల వద్ద ఆటో జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు తక్కువ వేతనం ఇస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

# పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



తారా కళాశాలలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

**నారాయణఖేడ్, సంగారెడ్డి టౌన్, మనూరు, ఐడిఏ బొల్లారం(జిన్నారం), గడ్డపోతారం(జిన్నారం), జహీరాబాద్, న్యూస్‌టుడే:** స్వచ్ఛతా హీ సేవలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఖేడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత అనే అంశంపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. కమిషనరు జగ్జీవన్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. మనూరు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో మంగమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశుభ్రతపై వివరించారు. ఐడిఏ బొల్లారం పట్టణంలో పురపాలక అధ్యక్షురాలు రోజారాణి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాలనీలో శ్రమదానం చేశారు. గుమ్మడిదల జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై ఎంపీడీవో ఉమాదేవి అవగాహన కల్పించారు. జిన్నారం మండలం గడ్డపోతారంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని మండల పంచాయతీ అధికారి రాజ్‌కుమార్ ప్రారంభించారు. జహీరాబాద్ పట్టణంలోని 7వ వార్డులో కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, పారిశుద్ధ్య అధికారి సంధ్యాకుమారి, పర్యావరణ అధికారి రాజ్‌కుమార్ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం నిరంతరం పోరాటం చేసిన యోధురాలు చాకలి ఐలమ్మ అని పలువురు కొనియాడారు. గురువారం ఐలమ్మ జయంతిని జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలు, కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఖేడ్‌లో స్థానిక ఆక్సిజన్ పార్కు ఎదురుగా ఉన్న ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చిట్కుల్‌లో కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. –న్యూస్‌టుడే, బృందం.



చిట్కుల్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నీలం మధు



జహీరాబాద్‌లో పట్టణంలో..



సంగారెడ్డి తారా కళాశాలలో..



సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



## 29న కరాటే పోటీలు

**సదాశివపేట, న్యూస్‌టుడే:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నామని పాఠశాలల ఆర్గనైజింగ్ కార్యదర్శి అమూల్యమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సదాశివపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 17 సంవత్సరాల యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. అభ్యర్థులు నేరుగా హాజరు కావాలని కోరారు. గెలుపొందిన అభ్యర్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు.

## పీఆర్టీయూ నూతన కార్యవర్గం

**మనూరు, న్యూస్‌టుడే:** నాగల్‌గిద్ద మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా నాగ్‌నాథ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

**హత్నూర:** హత్నూరలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పీఆర్టీయూ అధ్యక్షుడిగా వెంకటస్వామి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పద్మనాభం, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.అరుణ్‌కుమార్, శిరీష, ఉపాధ్యక్షులుగా అజ్మత్ అలీ, నగరాజ్, మహిళా కార్యదర్శులుగా కె.అరుణ, సుమలత ఎన్నికయ్యారు.

## ఆయిల్‌పామ్ సాగు పరిశీలన

**కొండాపూర్, న్యూస్‌టుడే:** కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామంలో రైతు నారాయణరెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను ఉద్యానశాఖ డివిజన్ అధికారిణి శైలజ, మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ ఉమతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలతో పాటు బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

## అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు రుణాలు




మాట్లాడుతున్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజరు సూర్యప్రకాష్

**నారాయణఖేడ్, న్యూస్‌టుడే:** అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు అర్హతను బట్టి వివిధ రుణాలు అందిస్తామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సూర్యప్రకాష్ తెలిపారు. గురువారం ఖేడ్ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో డివిజన్ స్థాయి విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తీసుకున్న రుణాలకు సంబంధించిన బకాయిలను సకాలంలో చెల్లిస్తే మరింత మందికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక ఎస్‌బీఐ మేనేజరు మురళీకృష్ణ, విశ్రాంత ఉద్యోగుల సంఘ బాధ్యులు నర్సింహులు, వెంకటేశం, సయ్యద్‌మొహియొద్దీన్, సంగ్‌శెట్టి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, వీరయ్య పాల్గొన్నారు.

## సుడి దోమ నివారణపై రైతులకు అవగాహన

**కల్హేర్, సిర్గాపూర్, న్యూస్‌టుడే:** వరి పైరులో సుడి దోమ తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున నివారణ చర్యలపై ఖేడ్ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు నూతన్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. గురువారం ఆయన అలీఖాన్‌పల్లి రైతులతో కలిసి పంటలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఎండోమెంట్ వ్యవస్థను రద్దు చేయండి

**సిర్గాపూర్(కంగ్టి), న్యూస్‌టుడే:** ఎండోమెంట్ వ్యవస్థను రద్దు చేసి హిందూ దేవాలయాలను, వాటి ఆస్తులను పరిరక్షించాలని దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు సాయిరాం పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కంగ్టి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విష్ణు సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దత్తాత్రేయ, నారాయణ, అంజన్న, నరేందర్, రమేష్ గౌడ్, గంగారాం, దత్తు పాల్గొన్నారు.

## వేధింపులకు గురిచేయొద్దు: ఏఐటీయూసీ

**సంగారెడ్డి అర్బన్, కొండాపూర్:** ఎంఎల్‌హెచ్‌పీలను వైద్యాధికారులు వేధింపులకు గురిచేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి గాయత్రీదేవికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంఎల్‌పీహెచ్‌లకు రూ.41 వేల జీతాలు ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. సంగారెడ్డిలో జిల్లా ఆస్పత్రిలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు 'వీడియో కాల్ అటెండెన్స్‌ను' సవరించాలని డిమాండు చేశారు. పల్లె దవాఖానాలను బలోపేతం చేయాలని కోరారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలు

**నారాయణఖేడ్, న్యూస్‌టుడే:** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలను ఖేడ్‌లోని జహీరాబాదు ఎంపీ సురేశ్ షెట్కార్ గృహ ఆవరణలో గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి పరస్పరం తినిపించుకున్నారు. ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలు, చేపట్టిన ఆర్థిక సంస్కరణలను కొనియాడారు. నాయకులు సాగర్ షెట్కార్, తాహెర్‌అలీ, సాయిలు పటేల్, నెహ్రూనాయక్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చర్లను సందర్శించిన డీపీవో

**హత్నూర, న్యూస్‌టుడే:** ముచ్చర్ల గ్రామాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సందర్శించారు. గ్రామంలో పర్యటించారు. పల్లె ప్రకృతి వనం, మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి పంచాయతీ సిబ్బందిని అభినందించారు.

## కల్వర్టులపై రాకపోకల నిలిపివేత

**న్యాల్‌కల్, న్యూస్‌టుడే:** మండలంలోని పలు వాగులను స్థానిక తహసీల్దార్ భూపాల్ పరిశీలించారు. కుసునూర్, రాఘవపూర్ గ్రామాల శివారు వాగు వరద ఉద్ధృతికి శిథిలమై ధ్వంసమైన కల్వర్టులను పరిశీలించి ప్రమాదకరంగా ఉండటంతో రాకపోకలను నిషేధించారు. రెజింతల్ మామిడి వాగును చూశారు. చాల్కి, బీదర్ రోడ్డు మార్గంలో వాగుకు రేయిలింగ్ లేకపోవడంతో నిర్మించాలని ఆర్ అండ్ బీ డీఈఈకి సూచించారు.